
మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

## నేటి మాట

నిరంతరం వెలిగే సూర్యున్ని చూసి
చీకటి భయపడుతుంది.
నిరంతరం శ్రమించేవాణ్ని చూసి
ఓటమి భయపడుతుంది



-స్వామి వివేకానంద

సంపుటి: 02 సంచిక 48 | బుధవారం 04 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

# ఘోర రోడ్డు ప్రమాదం.. 100 అడుగుల లోయలో పడ్డ ఆర్టీసీ బస్సు


2 లో

ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి 100 అడుగులకంటే లోతైన లోయలో పడిపోయింది. ఈ షాకింగ్ ఘటన ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ జిల్లా కల్సి ప్రాంతంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన బస్సు హిమాచల్ ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు చెందినదిగా గుర్తించారు. ఈ బస్సు క్వాను-మీనస్ రహదారిపై ప్రయాణిస్తుండగా, నియంత్రణ కోల్పోయి లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.

కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

తెల్లవారుజామున బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) కమాండెంట్ అర్పణ్ యదువంశీ ఆదేశాల మేరకు డాక్‌పత్తర్, చక్రతా, మోరి, త్యూని పోస్టుల నుండి ఎస్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. లోయ లోతుగా ఉండటంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, పోలీసులు, స్థానిక పరిపాలన యంత్రాంగం సమన్వయంతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. కాగా ప్రత్యక్ష సాక్షుల ప్రకారం మృతుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉందని, ప్రస్తుతానికి ఎటువంటి సమాచారం తెలియరాలేదు.

## ఐ ప్యాక్ ప్రాంగణంలో సోదాల వ్యవహారం
### ఈడీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా


2 లో

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పశ్చిమ బెంగాల్ లోని కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థ ఐ-ప్యాక్ ప్రాంగణంలో జరిగిన సోదాలు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే, రెయిడ్స్‌ను అడ్డుకున్నారనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం తదుపరి విచారణను ఫిబ్రవరి 10కి వాయిదా వేసింది. ఈ కేసులో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్, సీనియర్ పోలీసు అధికారులకు సుప్రీంకోర్టు గతంలోనే నోటీసులు జారీ చేసింది. తమ విధులకు ఆటంకం కలిగించారన్న ఈడీ ఫిర్యాదుపై సమాధానం ఇవ్వాలని కోరింది.

# తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు
## రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం

- భూముల మార్కెట్ విలువ సవరణకు కసరత్తు ప్రారంభం
- స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ కీలక అధ్యయన నిర్ణయం
- హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో కొత్త జోన్ల ప్రభావం
- సర్కిళ్ల వారీగా భూముల వాస్తవిక ధరల నివేదిక
- కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- రాబడి ఎక్కువున్న ప్రాంతాల్లో రిజిస్ట్రార్ ఆఫీసుల రీ-స్ట్రక్చరింగ్
- రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకతకు రేవంత్ సర్కార్ సంస్కరణలు
- సమీకృత సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులు- ప్రజలకు కార్పొరేట్ తరహా సేవలు

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్)

తెలంగాణలో భూముల ధరలు పెరగనున్నాయి. భూముల మార్కెట్ విలువ సవరణపై అధ్యయనం చేయాలని తాజాగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. గతఏడాది హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూముల విలువ సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత తెలంగాణ వ్యాప్తంగా.. సవరణ చేపట్టాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ మేరకు భూములు మార్కెట్ పెంపుపై ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం నుంచి ఆమోదం మాత్రం రాలేదు. ఈ క్రమంలో ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం పలు మార్పులు చేపట్టింది.

మిగతా 2 లో




## మీ ఆటలు ఇక్కడ సాగనివ్వం
### వాట్సాప్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్



2 లో

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దిగ్గజ టెక్ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. భారత చట్టాలను పాటించకపోతే దేశం విడిచి వెళ్లిపోవచ్చంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. వాట్సాప్ గోప్యతా విధానంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వాట్సాప్ మాతృసంస్థ మెటాను సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ తీవ్రంగా హెచ్చరించారు.

## నల్లగొండ జిల్లాలో దారుణం..
### లిఫ్ట్ ఇచ్చిన కారు యజమానిపై కత్తితో దాడి



2 లో

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మానవత్వంతో లిఫ్ట్ ఇచ్చిన ఓ కారు యజమానిపైనే దుండగుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నల్లగొండకు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి వ్యక్తిగత పని నిమిత్తం తన కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు.మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ అడగడంతో, ఇమ్రాన్ మానవత్వంతో అతడిని కారులోకి ఎక్కించుకున్నారు.

## సింగరేణిని కేసీఆర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చారు


2 లో

## హైదరాబాద్‌లో మహిళ దారుణ హత్య..




2 లో


## కూతురుతో సహా హైకోర్టు మహిళా లాయర్ ఆత్మహత్యాయత్నం


2 లో

## మైనర్‌కు మద్యం సరఫరా.. కంపెనీపై కేసు నమోదు


2 లో

## అమ్మ ఒంటరి అవుతుందన్న ఆవేదన.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం


2 లో

## విజయవాడ రైల్వే స్టేషన్లో కళ్లముందే యువకుడి హత్య


2 లో

## విద్యార్థిపై విరిగిన బెత్తం.. ఉపాధ్యాయుడి పై కేసు


2 లో

# ఆగని రక్తపాతం.. పాక్ సైన్యం - బిఎల్ఏ
## 48 గంటల యుద్ధంలో 225 మంది మృతి


2 లో

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పాకిస్థాన్‌లో 48 గంటలుగా పాక్ సైన్యం - బలూచిస్థాన్ ప్రావిన్స్ మధ్య భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులతో పాటు సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఏ) చేపట్టిన 'ఆపరేషన్ హెరోఫ్ ఫేజ్-2' ధాటికి పాక్ భద్రతా దళాలు విలవిలలాడాయి. ఈ భీకర దాడులతో ఇరువైపులా కలిపి సుమారు 225 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

12 ప్రాంతాల్లో భీకర దాడులు

గత నెల జనవరి 31 శనివారం ఉదయం ప్రారంభమైన ఈ దాడులు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడులు 'ఆపరేషన్ హెరోఫ్ ఫేజ్-2'లో భాగంగా క్వెట్టా, గ్వాదర్, నోష్కి, మస్తుంగ్ సహా సుమారు 12 జిల్లాల్లో ఏకకాలంలో జరిగాయి. బిఎల్ఏ తిరుగుబాటుదారులు పక్కా ప్రణాళికలతో అధునాతన ఆయుధాలు, గ్రెనేడ్లు, ఆత్మాహుతి దళాలతో పోలీస్ స్టేషన్లు, హై-సెక్యూరిటీ జైళ్లు, సైనిక స్థావరాలపై మెరుపు దాడులు చేశారు. ముఖ్యంగా మస్తుంగ్‌లో జైలుపై దాడి చేసి 30 మంది ఖైదీలను విడిపించడం సంచలనం సృష్టించింది.

బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బగ్టి, మిలిటరీ వర్గాల ప్రకారం, ఈ ఆపరేషన్‌లో 177 మంది తిరుగుబాటుదారులను సైన్యం హతమార్చింది. ఈ పోరులో 17 మంది సైనికులు మరణించగా, 31 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు.. తాము జరిపిన మెరుపు దాడుల్లో 200 మందికి పైగా పాక్ సైనికులను ప్రాణాలు కోల్పోయారని, పలువురిని బందీలుగా పట్టుకున్నామని దీూా ప్రకటించింది. అయితే ఈ క్లెయిమ్స్‌ను పాక్ ప్రభుత్వం కొట్టిపారేసింది.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం
## రాజ్యసభలో జేపీ నడ్డా కీలక ప్రకటన


2 లో

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గత 9 నెలలుగా నెలకొన్న వివాదానికి తెరదించుతూ సోమవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎక్స్ వేదిక సంచలన ప్రకటన చేశారు. భారత్-అమెరికా మధ్య ట్రేడ్ ఒప్పందం కుదిరిందని, భారత్ నుంచి అమెరికాలోకి దిగుమతి అయ్యే వస్తువులపై 18 శాతం టారిఫ్స్ మాత్రమే విధిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో భారత, అమెరికా వ్యాపార వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా.. భారత పార్లమెంట్‌లో మాత్రం ప్రతిపక్షాల నిరసనకు దారి తీసింది.

భారత్- అమెరికా మధ్య కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి, రాజ్యసభ పక్ష నేత జేపీ నడ్డా రాజ్యసభ వేదికగా స్పందించారు. ఈ ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే ఉభయ సభల్లోనూ సుమోటో ప్రకటన చేయడమే కాకుండా, దానిపై సమగ్ర చర్చకు కూడా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## మైనర్‌కు మద్యం సరఫరా.. కంపెనీపై కేసు నమోదు

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): 15 సంవత్సరాల బాలుడు ఫుల్ గా మద్యం తాగి.. 7వ అంతస్తు నుంచి పడిపోయి ప్రాణాలు కోల్పోవడం సంచలనంగా మారింది. ఈ షాకింగ్ ఘటన బెంగళూరు నగరంలోని రాజరాజేశ్వరి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మైనర్ బాలుడికి నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా చేసినట్లు గుర్తించారు. దీంతో ఒక ప్రైవేటు కంపెనీ యజమానులు, సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజరాజేశ్వరి నగర్ పరిధిలోని డాక్టర్ విష్ణువర్ధన్ రోడ్డులో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో నివసించే 15 ఏళ్ల బాలుడు, జనవరి 31 రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో తన అపార్ట్‌మెంట్ 7వ అంతస్తు నుంచి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రాథమికంగా ప్రమాదవశాత్తు మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు

మొదట ప్రమాదంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసులు మృతుడి స్నేహితులను విచారించి, సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. ఘటన జరిగిన రోజున సదరు మైనర్ బాలుడు తన స్నేహితులతో కలిసి అదే ప్రాంతంలోని ఒక కంపెనీకి చెందిన సంస్థలో మద్యం సేవించడం తో పాటు ధూమపానం చేసినట్లు పోలీసులు గుర్తించారు.

మైనర్ అని తెలిసి కూడా అతనికి మద్యం సరఫరా చేయడంపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మైనర్లకు మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరం కావడంతో పోలీసులు సంబంధిత కంపెనీ యజమానులు, అక్కడి సిబ్బందిపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. వారిపై జువైనల్ జస్టిస్ (జేజే) యాక్ట్ మరియు కర్ణాటక ఎక్సైజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు.

## అమ్మ ఒంటరి అవుతుందన్న ఆవేదన.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తాను పెళ్లి చేసుకుంటే ఎక్కడ తన తల్లి ఒంటరిదైపోతుంది.. తనను చూసుకునేవారెవరనే అమాయకపు ఆలోచన ఓ ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువతిని బలితీసుకుంది. హుస్సేన్ సాగర్ లో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే... ఆదిలాబాద్ జిల్లా భైంసా కు చెందిన విజయలక్ష్మి (26) తన తల్లితో కలిసి కూకట్‌పల్లిలోని మోతినగర్ లో నివాసం ఉంటోంది. తండ్రి మరణించడంతో తల్లికి తానై సర్వస్వంగా ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో రూ.లక్ష జీతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. తల్లి అనారోగ్యంతో ఉండటంతో విజయలక్ష్మి ఆమెను కంటికిరెప్పలా చూసుకునేది. ఈ క్రమంలో బంధువులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. అయితే వచ్చిన వారికి వివాహం అయ్యాక తల్లి కూడా తనతో పాటే ఉంటుందని కండీషన్ పెట్టడంతో ఒక్క సంబంధం కూడా ఖాయం కావడం లేదు.

గూగుల్ సెర్చ్ హిస్టరీ చూసి పోలీసులు షాక్..

తాను పెళ్లి చేసుకుని వెళ్లిపోతే అనారోగ్యంతో ఉన్న తల్లి ఒంటరై పోతుందని విజయలక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురైంది. గత కొన్ని రోజులుగా ఈ విషయంపై ఆమె తీవ్రంగా మదనపడేదని బంధువులు తెలిపారు. ఆ ఆందోళనలోనే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. పోలీసులు ఆమె ల్యాప్‌టాప్‌ను పరిశీలించగా ఆత్మహత్య ఎలా చేసుకోవాలని గూగుల్ లో సెర్చ్ చేసినట్లుగా తేలింది. ఈ మేరకు గత నెల 31న విజయలక్ష్మి ఓ ర్యాపిడో బైక్‌ను బుక్ చేసుకుని ట్యాంక్‌బండ్ చేరుకుంది. అక్కడ అన్నమయ్య విగ్రహం వద్ద దిగి ఎవరూ గమనించని సమయంలో హుస్సేన్‌సాగర్‌లో దూకేసింది. అప్పటి నుంచి ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తాజాగా హుస్సేన్ సాగర్‌లో ఓ మృతదేహం లభ్యమైంది. బంధువుల సాయంతో అది విజయలక్ష్మిదేనని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

## తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి



జీహెచ్ఎంసీ కోర్ అర్బన్ ప్రాంతాన్ని 12 జోన్లుగా విభజించింది. వాటిలో 60 సర్కిళ్లు, 300 డివిజన్లు ఏర్పాటు చేసింది. ఈ మార్పులను అనుసరించి ఆయా సర్కిళ్ల వారీగా భూముల వాస్తవిక విలువపై ఒక నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించినట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి చాలాకాలంగా ఎలాంటి మార్పులు చేపట్టలేదు. ప్రస్తుతం కోర్ అర్బన్ మార్పుల కారణంగా వీటికి సంబంధించి కూడా సంస్కరణలు చేపట్టే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రాబడి అధికంగా ఉండే ప్రాంతాలను కలుపుతూ కొత్తగా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటుచేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

ఇక రేవంత్ సర్కార్ రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకతను పెంచడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మంత్రి పొంగులేటి పలు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు భూమి పూజ సైతం చేసారు. ఈ విధానంలో భాగంగా.. పలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒకే చోట చేర్చి కార్పొరేట్ తరహాలో అత్యాధునిక భవన సముదాయాలను ఒకే చోట ఉండే విధంగా నిర్మిస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ ఇవి ఏర్పాటు కానున్నాయి. ఈ సమీకృత ఆఫీసుల్లోనే మ్యారేజ్ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణుల కోసం ఫీడింగ్ రూమ్స్, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక వెయిటింగ్ హాల్స్ వంటి ఆధునిక వసతులు కల్పిస్తున్నారు.

## విద్యార్థిపై విరిగిన బెత్తం.. ఉపాధ్యాయుడి పై కేసు

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిపై పైశాచికత్వం ప్రదర్శించాడు. తాను ఉపాధ్యాయుడినన్న సంగతి మరచి విద్యార్థిపై ప్రతాపం చూపాడు. బెత్తెంకు పని చెప్పి చిన్నారిని గాయపరిచాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనలో జహీరాబాద్ లోని బందెల్లి నగర్‌కు చెందిన విద్యార్థి సయ్యద్ జాన్ గాయపడ్డాడు. పట్టణంలోని వతన్బాగ్ లో గల ఓ ప్రైవేటు పాఠశాలలో జహీరాబాద్‌లోని బందెల్లి నగర్ కు చెందిన సయ్యద్ ఫైజాన్ అనే విద్యార్థి 8వ తరగతి చదువుతున్నాడు.

జనవరి 31న ఓ ఉపాధ్యాయుడు సయ్యద్ ఫైజాన్ అనే విద్యార్థిపై బెత్తం విరగొట్టాడు. దీంతో తల, వీపు, తొడ, రెట్టలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు అదే రోజు పోలీసులకు, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు యాజమాన్యంపై, విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోలేదని విద్యార్థి కుటుంబ సభ్యులు మహ్మద్ తాహెర్ తో పాటు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ. వినయ్ కుమార్ తో ప్రస్తావించగా ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## సింగరేణిని కేసీఆర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చారు.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణ ను లూటీ చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూదొందేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఇవాళ హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న ఆ రెండు పార్టీలకు బీజేపీ ని విమర్శించే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. అన్ని రకాలుగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. నాడు ఒక కుటుంబం దోచుకుంటే.. నేడు దోచుకున్న సొమ్ము కోసం మరో ఫ్యామిలీ కొట్లాడుతోందని అన్నారు. ఇక మంత్రులైతే విచ్చలవిడిగా వాటాల కోసం కయ్యానికి కాలుదువ్వుతున్నారని పేర్కొన్నారు.

సింగరేణికి తీరని అన్యాయం చేశారు..

కానీ, ఒక్కసారి బీజేపీకి అధికారమిస్తే మా పాలన ఏంటో చూపిస్తామని ఆయన అన్నారు. ఎప్పటికైనా తెలంగాణకు రక్షణ బీజేపీయేనని తెలిపారు. అదేవిధంగా సింగరేణి పాలనా వ్యవస్థలో మార్పులు రావాలన్నారు. ఆ సంస్థపై కేంద్రానికి ఎలాంటి అధికారాలు లేవని క్లారిటీ ఇచ్చారు. సింగరేణికి రాష్ట్రం నుంచి రూ. 51 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణికి తీరని అన్యాయం చేశాయని తెలిపారు. సింగరేణిని గత ప్రభుత్వం కేసీఆర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చారని ఎద్దేవా చేశారు. దీనివల్ల ప్రస్తుతం సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీని గద్దె దించుతామని కమ్యూనిస్టులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఉన్న ఒక్క ఎంపీతో అది సాధ్యమా అని ప్రశ్నించారు. ముందు కమ్యూనిస్టులు తమ పార్టీని కాపాడుకుంటే బెటర్ అని కిషన్ రెడ్డి చురకలంటించారు.

## ఐ ప్యాక్ ప్రాంగణంలో సోదాల వ్యవహారం.. ఈడీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా ఐ-ప్యాక్ కార్యాలయంలో దర్యాప్తుకు వెళ్లిన ఈడీ అధికారులపై పశ్చిమ బెంగాల్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో ఈడీ అధికారులపై ప్రస్తుతానికి ఎలాంటి పోలీసు చర్యలు తీసుకునే అవకాశం లేదు.

ఎవిడెన్స్ భద్రపరచాలని ఆదేశాలు..

ఐ-ప్యాక్ కార్యాలయంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచాలని బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ ఫుటేజీ సోదాల సమయంలో అసలు ఏం జరిగిందనే అంశాన్ని నిర్ధారించడంలో కీలకం కానుంది. ఈ కేసును కోల్‌కతా హైకోర్టులోనే విచారించాలని బెంగాల్ ప్రభుత్వం చేసిన వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ వివాదంలో రాజ్యాంగపరమైన కీలక అంశాలు ముడిపడి ఉన్నాయని, అందుకే తామే నేరుగా విచారణ చేపడుతున్నామని ధర్మాసనం ఇప్పటకే స్పష్టం చేసింది. కానీ, తాము చట్టబద్ధంగా సోదాలు నిర్వహిస్తుంటే పశ్చిమ బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం, పోలీసులు కలిసి తమను అడ్డుకున్నారని ఈడీ వాదిస్తోంది. మరో వైపు ఈడీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, అందుకే చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం బదులిస్తోంది.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. రాజ్యసభలో జేపీ నడ్డా కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

ట్రంప్ - మోదీ మధ్య స్నేహబంధం

సోమవారం సాయంత్రం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాల తగ్గింపు గురించి, ప్రధాని మోడీని తన 'నిజమైన మిత్రుడు' అని పేర్కొంటూ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్లను నడ్డా ప్రస్తావించారు. దీనికి ప్రతిస్పందనగా ప్రధాని మోడీ కూడా ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, వాణిజ్య సంబంధాల బలోపేతం పై ట్వీట్ చేశారని ఆయన సభకు వివరించారు.

ప్రతిపక్షాల తీరుపై మండిపాటు

ప్రభుత్వం అన్ని వివరాలను బహిర్గతం చేయడానికి, చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్, ఇండి కూటమి సభ్యులు సభలో ఆందోళన చేయడం సరైన పద్ధతి కాదని ఈ సందర్భంగా జేపీ నడ్డా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు వారి నిరాశ ను ప్రతిబింబిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఒప్పందంలోని ప్రతి చిన్న అంశాన్ని ప్రభుత్వం నేడు సభ ముందు ఉంచుతుందని, కాబట్టి ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన కోరారు.

## మీ ఆటలు ఇక్కడ సాగనివ్వం.. వాట్సాప్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్

మొదటి పేజీ తరువాయి




మా దేశ ప్రజల గోప్యతతో మీరు ఆటలాడలేరు. మా డేటాలో సింగిల్ డిజిట్ కూడా పంచుకునేందుకు మేము అనుమతించమని స్పష్టం చేశారు. భారత చట్టాలను పాటించడం ఇష్టం లేకపోతే ఈ దేశం విడిచిపెట్టవచ్చని సీరియస్ కామెంట్స్ చేశారు.

కేసు నేపథ్యం: వాట్సాప్ 2021 గోప్యతా విధాన నవీకరణను పరిశీలిస్తూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నవంబర్ 2024లో జారీ చేసిన ఉత్తర్వుల నుండి ఈ వివాదం తలెత్తింది. మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని ఉపయోగించి వినియోగదారులను కొత్త గోప్యతా విధానాన్ని తప్పనిసరిగా అంగీకరించేలా వాట్సాప్ ఒత్తిడి తీసుకువచ్చిందని సీసీఐ పేర్కొంది. వాట్సాప్ మెసేజింగ్ సేవలను కొనసాగించాలంటే మెటా ఇతర ప్లాట్‌ఫార్మ్‌లతో డేటా పంచుకోవడానికి అనుమతి ఇవ్వాల్సిందేనని వినియోగదారులకు తెలిపిందని సీసీఐ ఆక్షేపించింది. ఈ చర్య పోటీ చట్టానికి విరుద్ధమని భావించి రూ.213 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశించింది. ఈ ఉత్తర్వును మెటా, వాట్సాప్ 2025 జనవరిలో సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. 2025 నవంబర్‌లో న్యాయ ట్రైబ్యునల్ వాట్సాప్ డేటా షేరింగ్‌పై ఐదేళ్ల నిషేధాన్ని రద్దు చేసింది. అయితే రూ.213 కోట్ల జరిమానాను మాత్రం యథాతథంగా ఉంచింది. తాజాగా ఇవాళ విచారణ జరిపిన ధర్మాసనం మెటా తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

## నల్లగొండ జిల్లాలో దారుణం..

### లిఫ్ట్ ఇచ్చిన కారు యజమానిపై కత్తితో దాడి

మొదటి పేజీ తరువాయి

అయితే, కారు చిట్యాల పరిసర ప్రాంతాలకు చేరుకోగానే, వెనుక సీట్లో కూర్చున్న దుండగుడు అకస్మాత్తుగా తన వద్ద ఉన్న కత్తిని తీసి ఇమ్రాన్‌పై దాడి చేశాడు. ఇమ్రాన్ మెడ, శరీర భాగాలపై విచక్షణారహితంగా పొడిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదును లాక్కోవడానికి ప్రయత్నించాడు. తీవ్రంగా గాయపడిన ఇమ్రాన్ నిందితుడిని ధైర్యంగా ఎదర్కొనడంతో భయపడిన దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు.

రక్తపు మడుగులో ఉన్న ఇమ్రాన్‌ను గమనించిన స్థానికులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ప్రస్తుతం ఇమ్రాన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పారిపోయిన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న సీసీటీవీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు..

## ఘోర రోడ్డు ప్రమాదం.. 100 అడుగుల లోయలో పడ్డ ఆర్టీసీ బస్సు

మొదటి పేజీ తరువాయి

ఈ విషాద ఘటన పై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన డెహ్రాడూన్ జిల్లా మేజిస్ట్రేట్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు సమీపంలోని అన్ని మెడికల్ సెంటర్లను 'హై అలర్ట్' మోడ్‌లో ఉంచాలని సీఎం ఆదేశించారు. అలాగే పరిస్థితి విషమంగా ఉన్న క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే హెలికాప్టర్ ద్వారా పెద్ద ఆస్పత్రులకు తరలించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ప్రమాదానికి గల కారణాలు..

కాగా ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అయితే, మంచు- మూల మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. క్షతగాత్రులను వెలికితీసే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. గతేడాది ఇలాంటి ఘోర ప్రమాదాల్లో మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, ఈసారి రెస్క్యూ ఆపరేషన్‌ను ప్రభుత్వం అత్యంత వేగంగా నిర్వహిస్తోంది.

## హైదరాబాద్‌లో మహిళ దారుణ హత్య.. అనుమానాస్పదంగా సీసీ టీవీ ఫుటేజ్

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హైదరాబాద్ లో మరో దారుణం చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న మహిళలను దుండగలు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నగరంలోని దుండిగల్ పరిధిలో చోటు చేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సుశీలమ్మ అనే మహిళను దుండగులు హత్య చేసి అనంతరం అక్కడ నుండి పారిపోయారు. సోఫాలో సుశీలమ్మ మృతదేహం కనిపించగా వెంటనే కుటంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆమె మృతదేహంపై బలమైన గాయాలు ఉన్నట్టు గుర్తించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ తో కీలక ఆధారాలు సేకరించారు.

అనుమానాస్పదస్థితిలో మరణించి ఉండటంతో ఇది దొంగల పనా లేదంటే తెలిసినవారే డబ్బు, నగల కోసం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఇప్పటికే ఇద్దరు అనుమానితులను సైతం పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హత్య జరిగిన ప్రాంతంలో సంచరిస్తూ కనిపించారు. వారిలో ఒక యువకుడితో పాటు మర వ్యక్తి ఉన్నారు. ఇద్దరూ కంగారుపడుతున్నట్టు వీడియోలో కనిపిస్తోంది. అంతే కాకుండా ఇద్దరూ బైక్ పై కానీ వేరే వాహనంలో రాకుండా నడుచుకుంటూనే అక్కడ నుండి వెళ్లిపోయారు.

## కూతురుతో సహా హైకోర్టు మహిళా లాయర్ ఆత్మహత్యాయత్నం

న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హైకోర్టు మహిళా న్యాయవాది తన కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హృదయ విదారక ఘటన జార్ఖండ్ రాజధాని రాంచీ లోని అశోక్ నగర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న స్నేహా అఖౌరి (50) కుమారుడు, యువ చార్టర్డ్ అకౌంటెంట్ మిహిర్, ఇటీవలే కోల్‌కతా నుంచి రాంచీకి తిరిగి వచ్చారు. ఆయన ఒక కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ, ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణాలు విడిచారు. కుమారుడి మరణంతో తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిన స్నేహా అఖౌరి, ఆమె 14 ఏళ్ల కుమార్తెతో కలిసి విషం తాగారు. వారిద్దరూ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం గురునానక్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

గత కొంతకాలంగా స్నేహా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యాయత్నానికి కారణమా లేక మరేదైనా ఉందా అన్న కోణంలో అర్గోరా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలం నుండి ఆధారాలను సేకరించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్నేహా అఖౌరి కోలుకుంటేనే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఆగని రక్తపాతం.. పాక్ సైన్యం - బిఎల్‌ఏ 48 గంటల యుద్ధంలో 225 మంది మృతి

మొదటి పేజీ తరువాయి



ఈ సంక్షోభానికి అసలు కారణాలు

పాకిస్తాన్ కు సమీప ప్రాంతం అయిన బలూచిస్థాన్‌లో దశాబ్దాలుగా వేర్పాటు వాదం కొనసాగుతోంది. ఈ వేర్పాటువాద పోరాటం వెనుక లోతైన కారణాలు ఉన్నాయి. బలూచిస్థాన్ ఖనిజాలు, సహజ వాయువుకు నిలయం. కానీ ఇక్కడి సంపదను పాక్ ప్రభుత్వం తరలించుకుపోతూ, స్థానికులను దారిద్ర్యంలో ఉంచుతోంది. అలాగే గ్వాదర్ పోర్ట్ సహా చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టుల వల్ల స్థానికులకు ఎలాంటి ఉపాధి లభించడం లేదని, చైనా పౌరులకు రక్షణ కల్పించే పేరుతో తమపై అణచివేత సాగుతోందని తిరుగుబాటుదారులు ఆగ్రహంగా ఉన్నారు. అలాగే వేలాది మంది బలూచ్ యువకులు కనుమరుగవ్వడం, సైనిక హింస వంటి కారణాలు యువతను ఆయుధాల వైపు మళ్ళిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి

ఈ దాడుల నేపథ్యంలో ప్రావిన్స్ అంతటా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. హైవేలను సైన్యం తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ దాడుల వెనుక భారత్ హస్తం ఉందని పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మోసిన్ నఖ్వీ ఆరోపించగా, భారత్ ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. తమ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఇతరులపై నిందలు వేస్తోందని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కాగా ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్న పాకిస్తాన్ కు బలూచ్ వేర్పాటు వాదం, వరుస దాడులు తీరన నష్టాన్ని కలిగిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.


## విజయవాడ రైల్వే స్టేషన్లో దారుణం.. కళ్లముందే యువకుడి హత్య



న్యూస్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): విజయవాడ రైల్వే స్టేషన్లో అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యంమత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము - సాయి అనే ఇద్దరు స్నేహితులు విజయవాడ రైల్వేస్టేషన్ కు మద్యంసీసాలతో వెళ్లారు. అక్కడ ఏదో విషయమై ఇద్దరి మధ్య గొడవ జరగ్గా రాము ఆవేశంతో సాయిపై దాడి చేశాడు. తన చేతిలో ఉన్న మద్యం బాటిల్ తో సాయి మెడపై పొడవడంతో.. తీవ్ర రక్తస్రావంతో అతను అక్కడే మరణించాడు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో స్పాట్ కు చేరుకున్న పోలీసులు.. నిందితుడు రాముని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతనిపై గతంలోనే 15 కేసులు నమోదైనట్లు సమాచారం. సాయి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి.. అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

తెలంగాణ

## ప్లాట్లు కోల్పోయాం తమకు న్యాయం చేయాలి ప్లాట్ల సమస్య ను పరిష్కరించండి



పటాన్ చెరు, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటిలోని పెద్ద చెరువు లో ప్లాట్లు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి ని బాధితులు కోరారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద బాధితులు ఆయన ను కలిసి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యేండ్ల కిందట పైస, పైస కూడబెట్టి ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తే.. అధికారులు చెరువు తూము విడవక చెరువు నిండి తమ పాట్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పై అధికారులకు విన్నవించిన పరిష్కరించడం లేదన్నారు. అమీన్ పూర్ పెద్ద చెరువులో తమ ప్లాట్లు కోల్పోయామని, ఖీూ పెరగడంతో తమ పాట్లు పూర్తిగా మునిగిపోయాయని బాధితులు వాపోయారు.

**భూమికి భూమి ఇవ్వండి:** చెరువు ఎఫ్ టి ఎల్ ఫ్లాట్లు కోల్పోయిన బాధితులకు భూమికి భూమి ఇవ్వాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు..ఈ క్రమంలో ఎమ్మెల్సీ స్థానిక అధికారులతో ఫోన్ లో మాట్లాడాడు.. చెరువు స్థలంపై మున్సిపల్, రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులు రీ సర్వే చేసి, హద్దులను గుర్తించాలన్నారు.బాధితులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నామమాత్రపు టి డి ఆర్ ఇస్తే ఊరుకునే పరిస్థితి లేదని మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ అభ్యర్థులకు పార్టీ భీఫామ్ ల అందజేత



తొర్రూరు, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి తొర్రూరు పట్టణంలో స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ భీఫామ్ లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి పై సవతి తల్లి ప్రేమ ను చూపెడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ లకు ఓటు అడిగే హక్కు లేదు అని ఎద్దేవా చేశారు.ఈకార్యక్రమంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు,5వ వార్డు అభ్యర్థి పైండ్ల రాజేష్ ,1వ వార్డు అభ్యర్థి పూసాల రజితశ్రీమాన్, 2వార్డు అభ్యర్థి పల్లె కుమార్,3వ వార్డు అభ్యర్థి తూర్పాటి సాయి ముకేష్,4వ వార్డు అభ్యర్థి తూర్పాటి మెండీస్,6వ వార్డు అభ్యర్థి గట్ల శ్రావణిభరత్,7వ వార్డు అభ్యర్థి మంగళపల్లి యాకయ్య,8వ వార్డు అభ్యర్థి గంధం శ్యామల రాజు,9వ వార్డు అభ్యర్థి అలిసేరి సునితా రవిబాబు,10వ వార్డు అభ్యర్థి జలగం రవి,11వార్డు అభ్యర్థి కాగు నవీన్,12వ వార్డు అభ్యర్థి రాయపురం సుష్మ,13వ వార్డు అభ్యర్థి కాసోజు ఉమారాణి,14వ వార్డు అభ్యర్థి చెన్నోజు శ్రీదేవి విజయ్ కుమార్,15వ వార్డు అభ్యర్థి కొలుపుల సుజాత శంకర్,16వ వార్డు అభ్యర్థి నడిగడ్డ సందీప్ లతో పాటు గడల శేఖర్,నూనె అనిల్, వడ్లకొండ రవి,ఎనగందుల శ్రవన్, రాపాక ప్రశాంత్, నూకల నవీన్, శీలం శ్రీనాథ్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఆర్పిఐ పార్టీ సభ్యులు



కుత్బుల్లాపూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సూరారం కాలనీ పరిధిలోని సన్ షైన్ స్ట్రీట్ కాలనీలో జై భీమ్ మహాసేన తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఆవుల ఎస్తేరు రాణి పుట్టినరోజు సందర్భంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన జై భీమ్ మహాసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న, ఆర్పిఐ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గట్టు అశోక్ కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మంచి పదవులు పొంది ఉన్నత స్థాయికి వెళ్లాలని వారి కుటుంబాన్ని కూడా దేవుడు ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గజ్వేల్లి రమేష్, లక్ష్మణ్, ఆవుల రమేష్, రామకృష్ణ, సంతోష్, గజానంద్, యాదన్న, మున్నా, వెంకట్ రెడ్డి, యాదమ్మ, సులోచన, వారి బంధుమిత్రులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ ప్రేమ విందు పాస్టర్ ప్రసాదు





కుత్బుల్లాపూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జగద్గిరిగుట్ట 126 డివిజన్ లో బెతనీయ ప్రార్థన మందిరము నందు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడిన క్రిస్మస్ ప్రేమ విందు ఘనముగా జరిపించబడింది ఈ యొక్క కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఢ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ గౌట్ కోఆర్డినేటర్ కల్లోజిరవికుమార్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్స్. ఇంచార్జ్ గోడి శేఖర్, మూడు నియోజకవర్గాల ఇంచార్జ్ హనీటోచర్ పాల్గొని శు భాకాంక్షలు తెలియజేశారు.126 డివిజన్ బస్ కోఆర్డినేటర్ బ్రదర్ మలాకి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ కల్లోజి రవికుమార్, వారు మాట్లాడుతూ మన ప్రభుత్వము అన్ని కులాలు, మతాలకు ప్రాంతాలు అతీతంగా ఏటువంటి విభేదం లేకుండా చక్కటి పరిపాలన అందిస్తున్న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాయకత్వంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కోలన్ హనుమంత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, నర్సారెడ్డి భూపతి రెడ్డి, సహకారంతో మన గవర్నమెంట్ నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాలు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా మీకు చెందే విధంగా చేస్తామని వారికి వివరించడం జరిగినది శ్రీనివాస్ నగర్ రింగ్ బస్తి సమాధి తోటల కాంపౌండ్ వాల్ నిర్మాణం గురించి కమ్యూనిటీ హాల్ విషయంలో సహకారం అందిస్తామని తెలియజేశారు. మొట్టమొదటిసారిగా క్రైస్తవ ప్రార్థన మందిరాలకు వైట్ వాషింగ్ కొరకు లైటింగ్ కొరకు 30 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఎం. కుత్బుల్లాపూర్ కాన్స్టెన్సీ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షులు రేవ్. గోడి శేఖర్, జనరల్ సెక్రెటరీ బిషప్ ఎం.ఎస్ పీటర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్. రాజశేఖర్, జగద్గిరిగుట్ట పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్.పి డేవిడ్, జనరల్ సెక్రెటరీ పాస్టర్.జీ.కే.ప్రసాద్, ట్రెజరర్ పాస్టర్. తోట జాన్, కోర్ కమిటీ సభ్యులందరూ 126 జగద్గిరిగుట్ట డివిజన్ దైవజనులు అన్ని సంఘాలు ఆల్ డివిజన్స్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జనరల్ సెక్రెటరీ పాస్టర్లు క్రిస్టియన్ లీడర్స్ క్రిస్టియన్ సభ్యులు అలాగే కాంగ్రెస్ పార్టీ అన్ని డివిజన్ ప్రెసిడెంట్లు సీనియర్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు చర్చి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఎంపిడిఓ రాధికను మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ సర్పంచ్ లు



నర్సింహులపేట, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నర్సింహులపేట ఎంపీడీవో రాధికను కౌసల్యదేవిపల్లి గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,వంతడపల గ్రామ సర్పంచ్ బాలు నాయక్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రాధిక మాట్లాడుతూ.. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేసి ప్రజల మన్నలను పొందాలని సూచించారు.

## సూరారం విశ్వకర్మ కాలనీలో సీఎంఆర్ హాస్పిటల్ వారు ఉచితవైద్య శిబిరం





కుత్బుల్లాపూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సూరారం విశ్వకర్మ కాలనీ లో సీఎంఆర్ హాస్పిటల్ వారి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంచార్జ్ దుర్గ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మెడికల్ క్యాంప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కాలనీ అధ్యక్షులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీనివాస్,కే. నర్సింహా,కాలనీ అధ్యక్షులు ఎస్. జీవన్ రెడ్డి,విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, మల్లేష్,మస్తుదన్ రెడ్డి 'వెంకట్,రాములు, కిరణ్, మురళి,జిలాని గోపాల్ రెడ్డి,సందీప్,లత,రమ, బ్యాండు డేవిడ్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు మహిళలు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు,విశ్వకర్మ కాలనీలో చాలామంది నిరుపేదలు మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి ఇలాంటి మంచి కార్యక్రమాలు ప్రతినెల నిర్వహించాలని శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## గురుకుల పాఠశాల విద్యార్థినికి పాముకాటు



ఇనుగుర్తి, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అస్మిత అనే విద్యార్థిని మంగళవారం పాముకాటుతో అస్వస్థకు గురికాగా దీనిని గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన108 ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

## బౌరంపేట శ్రీశ్రీ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న బిఆర్ఎస్ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బౌరంపేట, దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని శ్రీశ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన జాతర ఉత్సవాల్లో బిఆర్ఎస్ఎల్పీ విప్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి సంప్రదాయ జాతరలు మన సంస్కృతి, ఆచారాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు అనంతరం మల్లన్న జాతర విజయవంతంగా జరగడం పట్ల నిర్వాహకులను ఎమ్మెల్యే, అభినందించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పల్పనూరి విష్ణువర్ధన్ రెడ్డి, నాచారం మురళి యాదవ్, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, ధర్మారెడ్డి, ఆకుల యాదయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు పద్మారెడ్డి, ఉపాధ్యక్షులు నాచారం సురేష్ యాదవ్, బాలరాజు ముదిరాజ్, సత్యనారాయణ, జంగారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహ యాదవ్, నరసింహ యాదవ్ భుజంగా రెడ్డి, చింతా మల్లేష్, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తొర్రూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి



తొర్రూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బొమ్మనబోయిన సుజాత వెంకన్న ని గెలిపించాలని కోరుతూ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి విస్తృతంగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తైన చేతి గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి బొమ్మనబోయిన సుజాత వెంకన్న ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి పనిచేస్తుందని అన్నారు. మహిళల సంక్షేమం, వార్డు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. సుజాత వెంకన్న గారు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకురాలని, ఆమెను గెలిపిస్తే 15వ వార్డులో మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్.. నటుడు మోహన్ బాబుపై కేసు నమోదు



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సినీ నటుడు మోహన్ బాబు మరో వివాదంలో చిక్కుకున్నారు. విద్యార్థుల కిడ్నాప్ ఘటనకు సంబంధించి ఆయనపై తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. చిత్తూరు జిల్లాలోని మోహన్ బాబు యూనివర్సిటీలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లేందుకు విద్యార్థి నేతలు అక్బర్, వినోద్ ప్రయత్నం చేశారు. అయితే మార్గంమధ్యలో ఇద్దరూ కూడా కిడ్నాప్‌నకు గురయ్యారు. దీంతో మోహన్ బాబు, విష్ణు పీఆర్వో సతీశ్‌పై విద్యార్థులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోహన్ బాబు యూనివర్సిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్

అయితే విద్యార్థులను కిడ్నాప్ చేసిన మోహన్ బాబు యూనివర్సిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు యూనివర్సిటీ చెల్లించాల్సిన కోట్లాది రూపాయాలను వెంటనే చెల్లించాలని, గతంలో హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ నోటీసులు ఇచ్చి జరిమానా విధించినప్పటికీ మోహన్ బాబులో ఎలాంటి మార్పురాలేదని విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి.

## జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదు



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న రైల్వేకోడూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదైంది. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషనర్ ఆదేశాలతో కడప జిల్లా ఎస్పీ ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. బిఎన్ఎస్ 318(2), 318(4), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మరోవైపు బుధవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విచారణ కమిటీ ముందు హాజరయ్యారు. అరవ శ్రీధర్ మీద ఓ మహిళ లైంగిక ఆరోపణలు చేసిన నేపథ్యంలో జనసేన పార్టీ ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంపై విచారణ కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా అరవ శ్రీధర్‌ను జనసేన అధిష్టానం ఆదేశించింది. వారం రోజులు గడువు ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్ జనసేన విచారణ కమిటీ ముందు నేడు హాజరయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు ఆయన్ను విచారణ కమిటీ ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ అనంతరం బయట మీడియాతో మాట్లాడారు. తన వివరణ మొత్తం అధిష్టానానికి చెప్పినట్లు అరవ శ్రీధర్ తెలిపారు. అన్ని వివరాలు సమర్పించానని.. పార్టీ నిర్ణయం తీసుకుంటుందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## పిచ్చికి పరాకాష్ట.. కనుగుడ్లపై టాటూ వేయించుకున్న యువకుడు



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రస్తుత కాలంలో యువత విభిన్నంగా కనిపించాలని రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జగదీష్ అనే యువకుడు చేసిన పని అందరినీ ఆశ్చర్యానికి, భయానికి గురిచేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగా ఐబాల్ టాటూ వేయించుకున్న వ్యక్తిగా గుర్తింపు పొందాలని అతను తన కనుగుడ్లపై టాటూ వేయించుకున్నాడు.

ఐటీఐ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన జగదీష్, ప్రస్తుతం టాటూ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. టాటూలు, పియర్సింగ్ వంటి విభాగాల్లో నేపాల్‌లో శిక్షణ పొందాడు. చిన్నప్పటి నుండి ఏదైనా కొత్తగా, డిఫరెంట్‌గా చేయాలనే తపనతో అతను ఈ అత్యంత ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. కంటిలో చిన్న నలుసు పడితేనే తట్టుకోలేము, అలాంటిది సూదులతో ఇంకును నేరుగా కంటి లేయర్లలోకి పంపడం అనేది వినడానికే భయంకరంగా ఉంది. ఈ టాటూ ప్రక్రియకు దాదాపు 3 నుండి 4 గంటల సమయం పడుతుంది. దీని కోసం జగదీష్ సుమారు రూ. 2 లక్షలు ఖర్చు చేశాడు (సాధారణంగా ఇది రూ. 5 లక్షల వరకు ఉంటుంది). నిపుణులు , వైద్యులు 50-50 శాతం ప్రమాదం ఉంటుందని, చూపు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించినా అతను వెనక్కి తగ్గలేదు.

తల్లిదండ్రులకు చెప్పకుండా ఈ పని చేసిన జగదీష్‌ను చూసి అతని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. టాటూ వేయించుకున్న తర్వాత కనీసం మూడు నెలల పాటు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే ఇన్ఫెక్షన్ సోకి చూపు శాశ్వతంగా పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రత్యేక గుర్తింపు కోసం ఇలాంటి ప్రాణాంతకమైన ప్రయోగాలు చేయడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి.. ఎమ్మెల్యే, ఆమె భర్త సహా 31 మందిపై కేసులు



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు తన న్యాయవాది ద్వారా పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దాని ఆధారంగా మొత్తం 31 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులో టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తన నివాసంపై దాడి చేసి కార్లు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పట్టాభిపురం పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్లు 127(2), 189(2), 324(4), 329(4), 351(2) తీ/ష 190 కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావుపై కూడా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దాడి ఘటనపై విచారణ ప్రారంభించిన పోలీసులు, సంబంధిత ఆధారాలను సేకరిస్తున్నారు.

ఇక, మరోవైపు, సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అంబటి రాంబాబును పోలీస్ కస్టడీకి అప్పగించాలంటూ నల్లపాడు పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు గుంటూరు కోర్టులో విచారణ జరగనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంబటి రాంబాబుపై పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు పోలీస్ కస్టడీకి అనుమతిస్తే, ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న అంబటి రాంబాబును విచారణ నిమిత్తం నల్లపాడు పోలీసులు గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తత నెలకొంది.

## జంతు కొవ్వుతో నూనె తయారీ.. నకిలీ నూనె గుట్టురట్టు!



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏలూరులో నకిలీ నూనె తయారీ వ్యవహారం సంచలనం సృష్టించింది. జంతు కొవ్వుతో నూనె తయారు చేస్తున్న కేంద్రాలను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గుట్టురట్టు చేశారు. ఆదివారపుపేట, తంగేళ్లమూడి ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో భారీగా నకిలీ నూనెను స్వాధీనం చేసుకున్నారు.

అధికారుల సమాచారం ప్రకారం.. కబేళాల నుంచి సేకరించిన జంతు కొవ్వు, ఎముకలను మరిగించి వచ్చిన చమురుతో నూనె తయారు చేస్తున్న ముఠా కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. తయారు చేసిన నూనెను తక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమంగా లాభాలు ఆర్జిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాడుల్లో సుమారు 600 కేజీల జంతు కొవ్వుతో తయారు చేసిన నూనెను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నూనె తయారీకి ఉపయోగిస్తున్న పరికరాలు, ముడిసరుకు పదార్థాలను కూడా జప్తు చేసినట్లు సమాచారం.

ఈ వ్యవహారంలో భాగంగా ఇద్దరు నకిలీ నూనె తయారీ దారులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇక అక్రమంగా నకిలీ నూనె తయారు చేసి విక్రయిస్తున్నందుకు సంబంధిత వ్యక్తులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## వామ్మో ఇంటి దొంగలు.. దుర్గగుడిలో ప్రతి రోజూ చేతివాటం..!



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో కనక దుర్గమ్మ ఆలయం ప్రవితత గురించి తెలియని వాళ్లు ఉండరు. ప్రతి నిత్యం భక్తులు భారీగా ఇంద్రకీలాద్రిని దర్శించుకుంటారు. కృష్ణమ్మ వడిలో స్నానం చేసి నిష్టగా అమ్మవారికి పూజలు చేస్తుంటారు. తిరిగి ఇంటి వెళ్లి పోయిన తర్వాత ఎంతో భక్తి శ్రద్ధలతో దుర్గమ్మను కొలుచుకుంటారు. స్థానిక గుడుల్లోనూ జగన్మాతను కొంగుబంగారంగా పూజలు చేస్తుంటారు. ఇలా ఎంతో మంది భక్తులు దూరం నుంచి వచ్చి ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారికి కానుకలు సమర్పించుకుంటారు.

అయితే కొందరు ఆలయ అధికారులు అమ్మవారి ఆలయం దగ్గరే ఉండి అపవిత్రమైన పనులు చేస్తున్నారు. అధికారులమనే విషయాన్ని కూడా మర్చిపోయి అమ్మవారికే శఠగోపం పెడుతున్నారు. దీంతో దుర్గ గుడి ఆలయం అధికారులపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అమ్మవారి ఆలయంలో దర్శనాల దందా జరుగుతోందని కొందరు భక్తులు ఆరోపిస్తున్నారు. అటు స్థానికుల కూడా అదే మాట చెబుతున్నారు. వీఐపీ , వీవీఐపీ దర్శనాల పేరుతో దుర్గ ఆలయంలో దందా నిర్వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అమ్మవారి ఆలయానికి బోర్డు మెంబర్సే గండి కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆఫీస్ నుంచి రోజుకి 100 నుంచి 150 మంది వరకు అనధికార దర్శనాలు చేయిస్తున్నట్లు పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

అయితే ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించాలని అంటున్నారు. అమ్మవారి ఆలయంలో అపవిత్రమైన పనులు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. అంతేకాదు ఈ అక్రమం వెనుక ఉన్న అసలు సూత్రదారులు, పాత్రదారులను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే నిందితుల నుంచి గుడికి పడిన గండిని రికవరీ చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అనంతపురం హైవేపై 'ఆకతాయి'ల వీరంగం.. చొక్కాలు విప్పి.. ట్రిపుల్ రైడింగ్!

ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, చొక్కలు విప్పి బైక్ నడుపుతూ హల్ చల్ చేసిన మైనర్ల వ్యవహారం అనంతపురంలో కలకలం రేపింది. 'పోలీసులు మమ్మల్ని ఏమీ చేయలేరు' అంటూ విర్రవీగిన ఆ యువకులకు పోలీసులు తమదైన శైలిలో బుద్ధి చెప్పారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జాతీయ రహదారిపై కొందరు యువకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఒకే బైక్‌పై ముగ్గురు యువకులు (ట్రిపుల్ రైడింగ్) ఎక్కడమే కాకుండా, ఓ వ్యక్తి చొక్కా విప్పి అర్ధనగ్నంగా విన్యాసాలు చేస్తూ వాహనదారులను భయాందోళనకు గురిచేశారు.

అడ్డుకుంటే అహంకారపు మాటలు..


వీరి ప్రవర్తనను గమనించిన మరో వాహనదారుడు ఇదేమిటని ప్రశ్నించగా.. నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. 'పోలీసులు మమ్మల్ని ఏమీ చేయలేరు' అంటూ అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. తాము మైనర్లమని, చట్టం తమను ఏమీ చేయదనే ధీమా వారి మాటల్లో స్పష్టంగా కనిపించింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ వీడియో ఆధారంగా స్పందించిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానంతో బైక్ నంబర్‌ను గుర్తించారు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టి ఆ ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మైనర్లుగా తేలారు.

అనంతరం పోలీసులు మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు, ర్యాష్ డ్రైవింగ్ చేసినందుకు భారీ జరిమానా విధించారు. వాహనం ఎవరి పేరు మీద ఉందో వారిపై కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు ప్రజలకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని, ఒకవేళ రోడ్డు ప్రమాదాలు జరిగితే వాహన యజమానులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## కళ్ల ముందే కాలి బూడిదైన కారు



ఏపీ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కొద్దిలో భారీ ప్రమాదం తప్పింది. కానీ కళ్లముందే కాలి బూడిదైంది. ఓ కారు అగ్నిప్రమాదం అక్కడున్న వారిందరిలో భయాందోళనలు కలిగించింది. ఈ ఘటన కడప జిల్లా మైదుకూరులో జరిగింది. ఓమినీ కారులో గ్యాస్ నింపేందుకు యజమాని ప్రయత్నం చేశారు. అది కూడా గ్యాస్ సిలిండర్ నుంచి ఫిల్ చేయబోయారు. ఇంతలో ఒక్కసారిగా మంటలు చెలగాయి. వెంటనే దట్టమైన పొగలు అలుముకున్నాయి. మరోవైపు అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. ఇంతలోనే కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది ఆర్పే లోపే కారు బాడీ తప్ప మిగిలినవన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. అయితే అక్కడున్న వారు అప్రమత్తంగా వ్యవహిరంచారు. వ్యాన్ నుంచి మంటలు చెలరేగుతున్న సమయంలో అక్కడి దూరంగా వెళ్లిపోయారు. కారు నుంచి అగ్ని శకలాలు చల్లబడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రైవేటుపరం చేయొద్దు

## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి




హైదరాబాద్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా ప్రభుత్వ బాధ్యతగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, సంక్షేమ పథకాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ మోతి నగర్ లేబర్ అడ్డా వద్ద కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రాపర్తి అశోక్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులు కార్మిక వ్యతిరేకమైనవని, వీటివల్ల కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. కాబట్టి ఈ లేబర్ కోడులను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసే లక్ష్యంతో తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, విద్యుత్‌ను ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాస్వామ్య సేవగా కొనసాగించాలని కోరారు.కార్మికులు, ప్రజలపై భారంగా మారిన జీఎస్టీ విధానాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును బలహీనపరిచే చర్యలు ఆపాలని, సంక్షేమ నిధులను కార్మికులకే నేరుగా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాలు, శంకర్, సోమేశ్, రమేష్, అబ్బాస్ మూర్తి, ఎల్లేష్‌తో పాటు భవన నిర్మాణ కార్మికులు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# నేడు ఆ గ్రామాలలో పవర్ కట్:గొడ్డటి అంకారావు(అసిస్టెంట్ ఇంజినీర్)



సత్తుపల్లి,ఆర్ సి, ఫిబ్రవరి, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వేంసూరు మండలం వేంసూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలో గల యర్రగుంటపాడు,చౌడవరం, వేంసూరు గ్రామాలకు నేడు అనగా బుధవారం ఉదయం 09 గంటల నుండి 12 గంటలవరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు అసిస్టెంట్ ఇంజినీర్ గొడ్డటి అంకారావు మంగళవారం మీడియాకు తెలిపారు.సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని గ్రామాలలోని ప్రజలు గమనించి, సహకరించాలని అంకారావు కోరారు.

# పంచాయతీ ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయి: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





భూపాలపల్లి, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పంచాయతీ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 29 వార్డుల పరిధిలో ఉన్న రాంనగర్, సుభాష్ కాలనీ, న్యూ సుభాష్ కాలనీల్లో సీపీఐ,సీపీఐ(ఎం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ముఖ్య నాయకులు, ఆయా వార్డుల ఎన్నికల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగుల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు.పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.అభివృద్ధి, సంక్షేమం నిరంతరం కొనసాగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ ప్రచారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగిందని, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.

# అభ్యర్థుల చేతికి 'బీ-ఫామ్' అందజేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- బీ-ఫామ్‌లు అందజేసి.. అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది
- మున్సిపాలిటీ బాధ్యతను నేను స్వయంగా తీసుకుంటున్నాను
- ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం
- మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి
- నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకైక లక్ష్యం
- మున్సిపాలిటీ పరిధిలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య





స్టేషన్ ఘనపూర్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థుల చేతికి బీ-ఫామ్ లు అందజేశారు. బీ-ఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు బి-ఫామ్ సమర్పించాలని ఎంపీ సూచించారు.అధికారికంగా పార్టీ తరఫున బీ-ఫామ్‌లు అందాయని పేర్కొన్న ఎంపీ, ప్రభుత్వ ప్రజారంజక పాలన, అమలవుతున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు.పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల

కల్పనకు తమ పార్టీ కట్టుబడి ఉందని, మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎంపీ కోరారు. గత పాలకులు స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేస్తానని గత ఎమ్మెల్యే మాటలు చెప్పడమే తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాతే స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ లో జరుగుతున్న అభివృద్ధిని చూసే ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.గతంలో వర్షం పడితే స్టేషన్ ఘనపూర్ వరదమయంగా మారేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత మరో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు.స్టేషన్ ఘనపూర్‌ను ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని అన్నారు.శివునిపల్లి చాగల్, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ మున్సిపాలిటీ గెలుపు బాధ్యతను తానే తీసుకుంటానని అభ్యర్థుల గెలుపు కోసం మనందరం కలిసి పని చేద్దామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేసుకొని పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే మున్సిపాలిటీకి వచ్చే నిధులు సక్రమంగా వినియోగించుకోవచ్చని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు.మున్సిపాలిటీలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్ రంగాల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. గత 15 ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో




నడిపించేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధికంగా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.1400 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే కడియం శ్రీహరికే దక్కిందన్నారు.దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.నియోజకవర్గ పరిధిలోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు.ఇటీవల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.45.50 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు.రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను 8 సబ్‌స్టేషన్ల నిర్మాణం ద్వారా పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాలలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందజేశామని తెలిపారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, ఈజీఎస్, ఎంపీ నిధులతో దాదాపు రూ.35 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయితీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పలు దఫాలుగా నిర్వహించిన సర్వేలు, టీపీసీసీ సర్వేల నివేదికల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు.పార్టీ తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టికెట్ ఆశించి అవకాశం దక్కని ఆశావాహులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో పార్టీ వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదవి కోసం కాదు ప్రజా సేవ కోసం వస్తున్నా

## నన్ను ఆదరిస్తే.. వార్డులో ప్రతి సమస్యను పరిష్కరిస్తా

## 14వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి శ్రీరాముల రాములు



మహబూబాబాద్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పదవి కోసం కాదని, ప్రజలే ఊపిరిగా పనిచేస్తానని బిఆర్ఎస్ 14వ వార్డు అభ్యర్థి శ్రీరాముల రాములు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.తనను ఆదరిస్తే 14 వ వార్డును మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడే వ్యక్తి అని, ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని పేర్కొన్నారు.నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల అవసరాలను తీరుస్తానని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ గత పది సంవత్సరాల పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని రాబోయే మూడేళ్ల తర్వాత వచ్చేది మన బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు, 14 వ వార్డు ప్రజలందరూ తనను ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓబుళాపూర్‌లో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సశిబిరం



జఫర్గడ్ , 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జనగామ జిల్లా జఫర్గడ్ మండలం ఓబుళాపూర్ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దొంతమళ్ళ సంతోష్, ఉపసర్పంచ్ ఎంపల్లీ సమ్మయ్య ప్రారంభించారు.ఉప్పుగల్ పశువైద్యాధికారి డా. కాకుమాను శ్రీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ..లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడ దూడలు మాత్రమే పుట్టే అవకాశం ఉంటుందని తెలిపారు.దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి తీసుకువచ్చిన పాడి పశువులకు డా. శ్రీనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మొత్తం 58 పశువులకు సేవలు అందించారు.వీటిలో 16 ఎదుకు రాని పశువులకు చికిత్స, 24 దూడలకు నట్టల నివారణ మందులు, 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ, 26 గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ వెంపటి రాజేశ్వర్ రావు, గోపాలమిత్రులు చిలువేరి నగేష్, సాంబరాజు దివ్య, కత్తుల లచ్చయ్య, గుజ్జరి రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామ పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు.

# భోజనం చేసిన తరువాత యాలకులను తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!

హెల్త్ డెస్క్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భోజనాన్ని రుచికరమైన మౌత్ ఫ్రెషర్ తో ముగియడం భారతదేశం పాత సంస్కృతిలో ఒక భాగం. భోజనం చేసిన తరువాత జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఇలా చేస్తూ ఉంటారు. మౌత్ ఫ్రెషర్ గా ఎక్కువగా సుగంధ ద్రవ్యాలను ఉపయోగిస్తూ ఉంటారు. మనం మౌత్ ఫ్రెషర్ గా వాడే సుగంధ ద్రవ్యాలల్లో యాలకులు ఒకటి. మౌత్ ఫ్రెషర్ గా వీటిని చాలా తక్కువ మంది వాడతారనే చెప్పవచ్చు. యాలకులు మంచి వాసనతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో లక్షణాలను కలిగి ఉంటాయి. వంటల్లో వీటిని వాడడం వల్ల వంటల రుచి, వాసన పెరుగుతుందని చెప్పవచ్చు. యాలకులను ఆయుర్వేదంలో కూడా ఎంతో కాలంగా ఔషధాల తయారీలో ఉపయోగిస్తున్నారు. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల మనకు మేలు కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల కలిగే మేలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



**నోటి దుర్వాసనకు చెక్..**

భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. ఇందులో ఉండే సుగంధ నూనెలు నోటిలో ఉండే బ్యాక్టీరియాతో పోరాడతాయి. దీంతో నోట్లో దుర్వాసన తగ్గుతుంది. భోజనం చేసిన తరువాత నోటి నుండి ఉల్లిపాయ లేదా వెల్లుల్లి వాసన వస్తూ ఉంటుంది. అలాంటి సమయంలో ఒక యాలక్కాయను నమలడం వల్ల వాసన తగ్గడంతో పాటు నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే యాలకులలో సినోల్ వంటి సహజ సమ్మేళనాలు, అవసరమయ్యే నూనెలు ఉంటాయి. ఇవి జీర్ణ ఎంజైమ్ లు ఎక్కువగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. భోజనం చేసిన తరువాత యాలకులను నమలడం వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. యాలకులను నమలడం వల్ల భారీ భోజనం చేసిన తరువాత వచ్చే అసౌకర్యం, భారం తగ్గుతాయి.

**లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..**

అదే విధంగా యాలకులల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటితో పాటు కాలేయం, మూత్రపిండాల డిటాక్సిఫికేషన్ ప్రక్రియను ప్రోత్సహించే సమ్మేళనాలు కూడా ఉంటాయి. దీంతో శరీరం నుండి విషపదార్థాలు సులభంగా తొలగిపోతాయి. అంతేకాకుండా యాలకులను నమలడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. యాలకులు చిన్నగా ఉన్నప్పటికీ వీటిని తీసుకోవడం వల్ల రోజువారి ఆరోగ్యం, జీర్ణ సమతుల్యతను కాపాడడంలో మనకు ఎంతో సహాయపడతాయి. భోజనం చేసిన తరువాత యాలకులను తీసుకోవడం వల్ల భోజనం చేసిన తరువాత తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో యాలకులు బరువు నియంత్రణకు సహాయక సాధనంగా మారతాయి. ఇలా అనేక రకాలుగా యాలకులు మనకు మేలు చేస్తాయని భోజనం తరువాత వీటిని నమలడం వల్ల నోటి ఆరోగ్యంతో పాటు జీర్ణ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి మంచి మౌత్ ఫ్రెషర్ గా పనిచేయడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వారు తెలియజేస్తున్నారు.

# కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నాయా..? అయితే ఈ విత్తనాలను తినండి..!

హెల్త్ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శరీరంలో వేగంగా పెరిగే కొలెస్ట్రాల్ బలహీనమైన గుండెకు సూచిక అని వైద్యులు చెబుతున్నారు. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు గుండె ఆరోగ్యానికి హానిని కలిగిస్తాయి. దీని వల్ల గుండె పనితీరు దెబ్బతినడంతో పాటు గుండె జబ్బులు, స్ట్రోక్, హార్ట్ ఎటాక్ వంటి గుండె సమస్యలు వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉండేలా చూసుకోవాలి. మనం తీసుకునే ఆహారాల ద్వారా కూడా మనం శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలతో పాటు కొన్ని రకాల విత్తనాలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను సహజంగా తగ్గించుకోవచ్చు. ఈ విత్తనాల్లో ఫైబర్, మంచి కొవ్వులతో పాటు ఫైటో కెమికల్స్ కూడా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను సహజంగా తగ్గించే విత్తనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.




**అవిసె గింజలు, నువ్వులు, గుమ్మడి గింజలు..**

కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో అవిసె గింజలు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లతో పాటు అల్ఫాలినోలెనిక్ ఆమ్లం కూడా ఉంటుంది. అలాగే వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను గ్రహించి శరీరం నుండి బయటకు తొలగిస్తుంది. అవిసెగింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు లిపిడ్ ప్రొఫైల్ కూడా మెరుగుపడుతుంది. వీటిని పెరుగు, ఓట్‌మీల్ వంటి వాటితో తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. నువ్వులను కూడా మనం ఎంతో కాలంగా ఆహారంగా తీసుకుంటున్నాం. నువ్వులు లిగ్నన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, మొక్కల స్టెరాల్స్ తో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. సలాడ్స్, స్మూతీ వంటి వాటితో నువ్వులను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.

చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విత్తనాల్లో గుమ్మడి గింజలు కూడా ఒకటి. వీటిలో మెగ్నీషియంతో పాటు ప్రోటీన్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ వంటి పోషకాలు ఉంటాయి. ప్రతిరోజూ గుమ్మడి గింజలను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిని చిరుతిండిగా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు శరీరానికి కావల్సిన పోషకాలు కూడా అందుతాయి.

**చియా విత్తనాలు, పొద్దుతిరుగుడు గింజలు..**

చిన్నగా ఉన్నప్పటికీ చియా విత్తనాలు శక్తివంతంగా పని చేస్తాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. చియా విత్తనాలను పుడ్డింగ్, పానీయాలను, సలాడ్ వంటి వాటితో పాటు తృణ ధాన్యాలపై టాపింగ్ లా వేసి తీసుకోవచ్చు. ఇలా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. అలాగే పొద్దు తిరుగుడు గింజలు కూడా కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిలో ఫైటోస్టెరాల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరం కొలెస్ట్రాల్ ను గ్రహించకుండా నిరోధించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు వెంటనే తగ్గుతాయి. ఉప్పులేని పొద్దుతిరుగుడు గింజలను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అధికంగా ఉండే కొలెస్ట్రాల్ స్థాయిలు గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా హానిని కలిగిస్తాయి కనుక శరీరంలో కొలెస్ట్రాల్ అదుపులో ఉండేలా చూసుకోవాలి. కొలెస్ట్రాల్ ను తగ్గించే విత్తనాలను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు కలుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



క్రాంతి
బుధవారం 04 ఫిబ్రవరి 2026

# క్రీడలు

epaper.krtvnews.com



## డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్.. ఎల్లో ఆర్మీ ఎంట్రీ ఫిక్స్




స్పోర్ట్స్ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో సూపర్ సక్సెస్ ఫ్రాంఛైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ త్వరలోనే మహిళల ప్రీమియర్ లీగ్ లోనూ అడుగుపెట్టబోతోంది. గత కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ.. మంగళవారం సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. మహిళల క్రికెట్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం తమ తదుపరి ప్రాధాన్యత అని విశ్వనాథన్ స్పష్టం చేశారు. తాము త్వరలోనే మహిళల క్రికెట్‌లో పెట్టుబడి పెట్టబోతున్నామని, డబ్ల్యూపీఎల్‌లో చెన్నై జట్టును తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. బీసీసీఐ జట్లను విస్తరించాలని నిర్ణయించినప్పుడు సీఎస్కే యాజమాన్యం బిడ్డింగ్‌లో పాల్గొని జట్టు సభ్యులను కొనుగోలు చేస్తుందని క్లారిటీ ఇచ్చారు.

సీఎస్కే అభిమానుల్లో నయా జోష్..

ఐపీఎల్‌లో ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్కేకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు అదే బ్రాండ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లోకి వస్తుండటంతో అభిమానులు అంతనేని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముంబై ఇండియన్స్, ఆర్సీబీ వంటి జట్లు డబ్ల్యూపీఎల్‌లో రాణిస్తుండగా.. తాజాగా చెన్నై కూడా తోడైతే లీగ్ స్థాయి మరింత పెరుగుతుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తానన్న పాకిస్థాన్.. మాజీ క్రికెటర్లు ఏమంటున్నారంటే




స్పోర్ట్స్ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో జరగాల్సిన మ్యాచ్ ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు క్రికెటర్లు స్పందించారు. పాకిస్థాన్ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, మొహమ్మద్ యూసుఫ్‌లు పశ్చాతాపాన్ని వ్యక్తం చేశారు. కానీ తమ దేశం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండనున్నట్లు చెప్పారు. భారత మాజీ ప్లేయర్ సునీల్ గవాస్కర్ భిన్నంగా స్పందించారు. పాకిస్థాన్ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఎందుకంటే మెగా టోర్నీల్లో పాక్ ఇలాగే యూ టర్న్ తీసుకుంటుందన్నారు.

రాజకీయాల వల్ల మూతపడ్డ దారులు.. క్రికెట్‌తో తెరుచుకుంటాయని విశ్వసిస్తాని షాహిద్ అఫ్రిదీ అన్నారు. వరల్డ్‌కప్‌లో ఇండియాతో పాక్ ఆడదం లేదని, కానీ ప్రభుత్వ నిర్ణయానికి బాసటగా ఉన్నామని, ఇలాంటి సందర్భాల్లో ఐసీసీ నిష్పక్షపాత నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి సభ్యుడికి న్యాయం జరగాలన్నారు. యూసుఫ్ స్పందిస్తూ ఇది చాలా కఠినమైన నిర్ణయం అని, గవర్నమెంట్‌కు కట్టుబడి ఉన్నామని, కమర్షియల్ ప్రయోజనాల కన్నా ముందు విలువలు ముఖ్యమని, క్రికెట్‌లో ఉన్న పక్షపాతం ముగిసిపోవాలని యూసుఫ్ పేర్కొన్నారు.

రానున్న నాలుగైదు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రియాక్షన్లు వస్తాయని, మాజీ ఆటగాళ్లు కూడా స్పందిస్తారని, పాకిస్థాన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటదని భావిస్తున్నానని సునీల్ గవాస్కర్ అన్నారు. దీంట్లో కొత్త ఏం ఉందని, పాక్ క్రికెటర్ల గురించి తెలుసు అని, ముందు రిటైర్మెంట్ ప్రకటిస్తారని, మళ్లీ నాలుగు రోజుల తర్వాత అభిమానులు ఆడమన్నారని ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటారన్నారు. ఐసీసీ న్యాయం చేసేంత వరకు వేచి ఉండాలని, బహుశా ఆంక్షలు, జరిమానాలు పడే అవకాశం ఉందని, మళ్లీ ఐసీసీ టోర్నీ నిర్వహించే అవకాశం ఆ దేశానికి దక్కదని హర్భజన్ సింగ్ అన్నారు.

పాకిస్థాన్ తమ స్వంత క్రికెట్‌ను నాశనం చేసుకుంటోందని మదన్ లాల్ అన్నారు. ఇది వాళ్ల సమస్యలను పరిష్కరించలేదన్నారు. సరైన రీతిలో ఆలోచన చేయాలని, ప్రస్తుతం వారి ఆలోచనలు సరిగా లేవన్నారు.

## ఎచ్.సి.ఏ కొత్త అధ్యక్షుడిగా అమర్‌నాథ్.. ఉత్తర్వులు జారీ చేసిన అంబుడ్స్‌మన్




స్పోర్ట్స్ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కొత్త ప్రెసిడెంట్‌గా అమర్‌నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇవాళ బీసీసీఐ అంబుడ్స్‌మన్ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అరెస్ట్ అయ్యాక గత 9 నెలలుగా హెచ్‌సీఏ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. ఈ క్రమంలోనే తనను హెచ్‌సీఏ అధ్యక్షుడిగా నియమించాలంటూ ఇటీవలే అమర్‌నాథ్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న అంబుడ్స్‌మన్, అమర్‌నాథ్‌ను హెచ్‌సీఏ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గత ఎన్నికల్లో ఓటు తేడాతో ఓటమి.. అక్టోబర్ 20, 2023న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో 'యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ' ప్యానెల్ అభ్యర్థి జగన్‌మోహన్ రావు తన సమీప ప్రత్యర్థి అమర్‌నాథ్‌పై కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. మొత్తం అసోసియేషన్‌లో 173 ఓట్లు ఉండగా, 169 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో జగన్‌మోహన్ రావుకు 63 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 62 ఓట్లు వచ్చాయి. దీంతో నాడు జగన్‌మోహన్ రావు హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

## రీఎంట్రీలో అదరగొట్టిన తెలుగోడు.. టీ20 వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచ్‌లో భారత్-ఏ ఘన విజయం



స్పోర్ట్స్ న్యూస్, 03 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీమిండియా యువ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ రీ ఎంట్రీలోనే తన ప్రతిభను చాటుకున్నాడు. శస్త్రచికిత్స కారణంగా ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు దూరమైన ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్ ఇప్పుడు పూర్తిస్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించి మైదానంలోకి అడుగుపెట్టాడు. టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా భారత్-ఏ జట్టు తరపున యూఎస్ఏపై బరిలోకి దిగిన తిలక్ వర్మ చురుకైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతని ప్రదర్శన భారత జట్టుకు మంచి సంకేతంగా మారింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ వర్మ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు సాధించాడు.

ముఖ్యంగా షాట్ల ఎంపిక, స్ట్రైక్ రొటేషన్‌లో అతని నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. గాయానంతరం ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేయడంతో పాటు ఫీల్డింగ్‌లోనూ చురుకుగా కదిలి తన ఫిట్‌నెస్‌పై సందేహాలకు చెక్ పెట్టాడు. టీ20 వరల్డ్‌కప్ దృష్ట్యా అతని ఈ ఫామ్ భారత జట్టుకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. మ్యాచ్ విషయానికి వస్తే భారత్-ఏ జట్టు 38 పరుగుల తేడాతో యూఎస్ఏపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోర్ చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్ జగదీశన్ అద్భుత శతకంతో మెరిశాడు. అతను 55 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. కెప్టెన్ ఆయుష్ బదోని కూడా దూకుడుగా ఆడి కేవలం 26 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో అజేయంగా 60 పరుగులు సాధించాడు. మధ్యలో తిలక్ వర్మ వేగవంతమైన ఇన్నింగ్స్ జట్టుకు మరింత ఊపునిచ్చింది.

239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యూఎస్ఏ జట్టు ప్రారంభంలో కొంత పోరాటం చూపించినప్పటికీ చివరికి భారత బౌలర్ల ముందు నిలవలేకపోయింది. 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. యూఎస్ఏ బ్యాటర్లలో ఆండ్రీస్ గాస్ 44 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, సంజయ్ కృష్ణమూర్తి 41 పరుగులు చేశాడు. అయితే భారత బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో వారు విఫలమయ్యారు. భారత్-ఏ బౌలర్లలో రవి బిష్ణోయ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు కీలక వికెట్లు తీసుకున్నాడు. నమన్ ధీర్, ఖలీల్ అహ్మద్ చెరో రెండు వికెట్లు పడగొట్టి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టి ప్రదర్శన కనబరిచిన భారత్-ఏ జట్టు వార్మప్ మ్యాచ్‌లో సత్తా చాటి టీ20 వరల్డ్‌కప్‌కు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించింది. తిలక్ వర్మ రీ ఎంట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం భారత అభిమానులకు ఉత్సాహాన్ని కలిగించింది.

KR TV క్రాంతి

బుధవారం 04 ఫిబ్రవరి 2026

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## పాత పగ కొత్త యుద్ధం

### అంచనాలను పెంచుతున్న 'ధురంధర్ రివెంజ్' టీజర్




బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణవీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధార్ కలిసి చేసిన మ్యాజిక్ 'ధురంధర్'. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సినిమా బాలీవుడ్ రికార్డులను తిరగరాసింది. ముఖ్యంగా రణవీర్ స్టైల్, అక్షయ్ ఖన్నా విలనిజం మధ్య సాగే సీన్లు ఆడియన్స్‌కు పూనకాలు తెప్పించింది. ఇక ఇప్పుడు ఈ బ్లాక్ బస్టర్ మూవీకి సీక్వెల్‌గా 'ధురంధర్ రివెంజ్' రాబోతోంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే మొదటి భాగం ఎక్కడ ముగిసిందో, అక్కడి నుండే కథ మొదలైనట్లు కనిపిస్తోంది. రణవీర్ సింగ్ తన పాత పగను తీర్చుకోవడానికి ఎంత దూరం వెళ్లాడు.. యుద్ధం ఎలా చేశాడు అనేదే ఈ 'రివెంజ్' కథ.

విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉన్నాయి. ఆదిత్య ధార్ మేకింగ్ స్టైల్ మరోసారి అబ్బురపరుస్తోంది. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కూడా టీజర్‌కు హైలెట్‌గా నిలిచింది. పార్ట్ 1 లో అక్షయ్ ఖన్నా నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఇప్పుడు సీక్వెల్‌లో వీరిద్దరి మధ్య సాగే సీన్లు మరింత క్రేజీగా ఉండబోతున్నట్లు టీజర్ హింట్ ఇస్తోంది. రణవీర్ మాస్ లుక్, అక్షయ్ ఖన్నా కోల్డ్ విలనిజం మధ్య వార్ ఈసారి నెక్స్ట్ లెవల్‌లో ఉండబోతోందని అర్థమవుతోంది. చివర్లో.. ఇది నూతన భారతదేశం.. సరిహద్దులు దాటి ఇంట్లోకి చొచ్చుకొచ్చి.. చంపుతుంది కూడా" అని రణవీర్ చెప్పిన డైలాగ్స్ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతోంది. కాగా.. ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్ సరసన సారా అర్జున్ హీరోయిన్‌గా నటిస్తోంది.

షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ ఉగాది కానుకగా.. మార్చి 19న విడుదల కాబోతుంది. అదే రోజున కన్నడ స్టార్ యష్ నటించిన మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' కూడా విడుదల తేదీని ప్రకటించింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో నయనతార, కియారా అద్వానీ వంటి స్టార్స్‌తో వస్తున్న ఈ సినిమాతో రణవీర్ సింగ్ పోటీ పడాల్సి రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రెండు భారీ బడ్జెట్ సినిమాలు ఒకే రోజున పోటీపడితే వసూళ్లపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో, 'టాక్సిక్' విడుదల వాయిదా పడుతుందా లేదా అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. ఈ క్రేజీ బాక్సాఫీస్ ఫైట్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలంటే మార్చి 19 వరకు వేచి చూడాల్సిందే.

## ఫేమ్ కోసం

### ఇలాంటి పోస్టులా..?



మలయాళ ఇండస్ట్రీ నుండి వచ్చి 'ఛాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యంగ్ సెన్సేషన్ బ్యూటీ అనస్వర రాజన్. 'విత్ లవ్'సినిమా ద్వారా అనస్వర మరోసారి తెలుగు బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని చూస్తోంది. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ స్వచ్ఛమైన ప్రేమకథలో అభిషన్ జీవింత్ హీరోగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్రానికి మదన్ దర్శకత్వం వహించగా, సురేష్ ప్రొడక్షన్స్ పంపిణీలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషన్స్‌లో పాల్గొన్న అనస్వర పలు ఫన్నీ కామెంట్స్ చేసి వివాదంలో చిక్కుకుంది.

షూటింగ్ సెట్‌లో తన సహనటుడు అభిషన్ జీవింత్‌తో కలిసి పనిచేసేటప్పుడు, ఆయనతో స్నేహం పెంచుకోవడానికి తాను మూగ దానిలా నటించానని అనస్వర సరదాగా చెప్పిన మాటలను వివాదాస్పదంగా చేస్తూ పలు వార్తలు రాస్తున్నారు. ఈక్రమంలో.. ఈ విషయంపై అనస్వర స్పందిస్తూ.. నవ్వుతూ చెప్పిన మాటల నుండి ఒకే ఒక్క లైన్ తీసుకుని దానిని భూతద్దంలో చూపించడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇన్ స్టాగ్రామ్ పోస్ట్‌లో ఘాటుగా స్పందించింది. ముఖ్యంగా తాను అన్న మాటలను వక్రీకరించి, అవి ఏదో అహంకారంతో చేసిన వ్యాఖ్యల్లా చిత్రించడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు. కేవలం వెబ్‌సైట్లకు రీచ్ రావాలని లేదా వ్యూస్ పెంచుకోవాలని ఒక నటి గౌరవానికి భంగం కలిగించేలా వార్తలు రాయడం జర్నలిజం అనిపించుకోదని ఆమె ఘాటుగా విమర్శించారు.

సాధారణంగా తాను ఇటువంటి గాసిప్స్‌ను పట్టించుకోనని, కానీ ఈసారి తన వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేస్తుంటే మౌనంగా ఉండటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. "ఒక స్నేహపూర్వక వాతావరణంలో జోక్స్ వేసుకున్న మాటలను పట్టుకుని, వాటిని సీరియస్ స్టేట్‌మెంట్స్‌గా మార్చడం కరెక్ట్ కాదు. ఇది కేవలం ఫేమస్ అవ్వడం కోసం చేస్తున్న ప్రయత్నం మాత్రమే" అని ఆమె మండిపడ్డారు. తాను అనని మాటలను అన్నట్లుగా ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో నెగిటివిటీని సృష్టించడం వల్ల తనతో పాటు తన కుటుంబం కూడా ఎంతో మానసిక వేదనకు గురైందని ఆమె తన పోస్ట్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఎదుగుతున్న క్రమంలో ఇటువంటి అడ్డంకులు సహజమే అయినప్పటికీ, బాధ్యతాయుతమైన మీడియా సంస్థలు వాస్తవాలను గ్రహించి వార్తలు రాయాలని కోరింది.

## అరుదైన జబ్బుతో పోరాడిన చిన్నారి

### ప్రాణాలు కాపాడిన శృతి హాసన్

మనం వెండితెరపై చూసే స్టార్లు నిజ జీవితంలో ఎలా ఉంటారో అని అందరికీ ఆసక్తి ఉంటుంది. కొందరు గ్లామర్‌కే పరిమితమైతే, మరికొందరు తమకున్న స్టార్‌డమ్‌ని తోటివారికి సాయం చేయడానికి వాడుతుంటారు. ఆ కోవలోకే వస్తుంది టాలెంటెడ్ బ్యూటీ శృతి హాసన్. తాజాగా ఒక అరుదైన జబ్బుతో చావుబతుకుల్లో ఉన్న ఓ చిన్నారి ప్రాణాలను కాపాడి, ఆ కుటుంబానికి దేవుడిలా అండగా నిలిచింది ఈ ముద్దుగుమ్మ.

'ఆల్వి' అనే చిన్నారికి పుట్టుకతోనే ఎంఎస్ఎండీ అనే చాలా అరుదైన జన్యు సంబంధిత వ్యాధి వచ్చింది. పాపం ఆ పసిపాప పుట్టినప్పటి నుంచీ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. అయితే 2025లో ఆ చిన్నారికి ఎముక మజ్జ మార్పిడి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ క్లిష్ట సమయంలో శృతి హాసన్ ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. పాప పరిస్థితి సీరియస్ అయ్యి ఐసీయూలో ఉన్నప్పుడు, శృతి హాసన్ ఊరికే డబ్బు ఇచ్చి చేతులు దులుపుకోలేదు. స్వయంగా రంగంలోకి దిగి, బెస్ట్ డాక్టర్లతో మాట్లాడి పాపకు మెరుగైన వైద్యం అందేలా చూసింది. డాక్టర్ ధరణి, డాక్టర్ దివ్య వంటి నిపుణులను ఆ ఫ్యామిలీకి పరిచయం చేసి, ఆ పాప ప్రాణాలు దక్కేలా చేసింది. వైద్యంతో పాటు ఆర్థికంగా, మానసికంగా కూడా ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇచ్చింది.

ఇటీవల ఆ చిన్నారి ఆల్వి తన పేరెంట్స్‌తో కలిసి శృతిని కలిసింది. ఆ సమయంలో శృతి ఆ పాపతో ఆడుకుంటున్న వీడియో చూస్తుంటే ఎవరికైనా కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి. "మా పాప ఈరోజు బతికి ఉందంటే అది కేవలం శృతి గారి వల్లే" అంటూ ఆ తల్లిదండ్రులు ఎమోషనల్ అయ్యారు. శృతి ఆ పాప కోసం ఒక పెద్ద బిస్కెట్ ప్యాకెట్ తెచ్చి ఇస్తూ, తన సొంత ఇంటి మనిషిలా ఆదరించిందట.



## ఉస్తాద్ భగత్ సింగ్ ఊగిసలాట



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' పై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మాత్రం క్లారిటీ రావడం లేదు. మేకర్స్ ఇదివరకే సమ్మర్‌లో రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో.. మార్చి 27 రావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' వాయిదా పడనుందని తెలుస్తుండగా.. అదే రోజు ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారు మేకర్స్. నిజానికి, ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా చివరి దశకు చేరుకుంది. ఇటీవలె డబ్బింగ్ వర్క్ కూడా మొదలు పెట్టారు.

త్వరలోనే పవన్ కళ్యాణ్ డబ్బింగ్ పూర్తి చేయనున్నారు. ఈ సినిమా అవుట్‌పుట్‌పై ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొత్తంగా ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నట్టే. కానీ అధికారిక రిలీజ్ డేట్‌ను మాత్రం ప్రకటించలేదు. దీంతో.. డేట్ ప్రకటించడంలో ఆలస్యం వెనుక రకరకాలు చర్చ జరుగుతోంది. మార్చ్ నెలలో ఇతర పెద్ద సినిమాల రిలీజ్‌లు ఉన్నాయి. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ 'ధురంధర్' సీక్వెల్ మార్చ్ 19న రిలీజ్ అవుతోంది. యశ్ 'టాక్సిక్' కూడా అదే రోజు విడుదలవుతోంది. ఇలాంటి అంశాలన్నీ పరిశీలించిన తర్వాతే ఖచ్చితమైన తేదీని ఫిక్స్ చేయాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు, పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రం అధికారిక ప్రకటన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మొత్తంగా, 'ఉస్తాద్ భగత్ సింగ్' సమ్మర్‌లో థియేటర్లలో సందడి చేయడం దాదాపు ఖరారైనప్పటికీ, రిలీజ్ డేట్ మాత్రం ఇంకా సస్పెన్స్‌గా కొనసాగుతోంది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com